క్లుప్తంగా

ఐషర్ ఢీకొని బేల్దారి మృతి

నెల్లూరు(క్రైమ్): ఐషర్ ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. భగత్‌సింగ్ కాలనీకి చెందిన రియాజ్ (58) బేల్దారి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. జాతీయ రహదారిపై భగత్‌సింగ్ కాలనీ సమీపంలో చేపల యార్డ్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి కావలి వైపు వెళుతున్న ఐషర్ లారీ వేగంగా ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విశ్వనాథునికి అన్నాభిషేకం



మనుబోలు : మనుబోలు రైల్వేగేటు సమీపంలో వెలసిన విశ్వనాథ స్వామికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా బుధవారం అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు మంత్రోచ్చారణల మధ్య ప్రదోష సమయంలో స్వామి వారికి అన్నాభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం గావించి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విశ్వనాథుని దర్శించుకున్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పొదలకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. 15 ఏళ్లు నిండిన వారు ఆసక్తి కలిగిన క్రీడలో పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. గ్రామ, వార్డు సచివాలయాలు లేదా 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా ‘ఆడుదాం ఆంధ్రా’ ఏపీ ప్రభుత్వ పోర్టల్ ద్వారా ఉచితంగా ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, మొబైల్ నంబర్‌తో పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రభుత్వం నగదు బహుమతులను అందజేస్తుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతుల కింద రూ.20 వేలు, రూ.10 వేలు అందజేస్తుందన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతుల కింద రూ.లక్ష, రూ.50 వేలు, రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతుల కింద రూ.5 లక్షలు, రూ.3 లక్షలు అందజేస్తారన్నారు. డిసెంబరు 13వ తేదీ వరకు పేర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

అన్నదానం



కోవూరు : ఆవాజ్ వార్షికోత్సవ వేడుకలను కోవూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతినగర్‌లో ఉన్న లక్ష్మీపార్వతి వృద్ధుల సేవా సదన్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం ఆవాజ్ మండలాధ్యక్ష, కార్యదర్శులు షేక్ చాన్ బాషా, సుబ్బారావు మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



అల్లూరు: అల్లూరు–1 సచివాలయ పరిధిలోని అమ్మనబ్రోలు విజయలక్ష్మి ఇటీవల గుండెపోటుతో మరణించగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమె భర్తకు సచివాలయం–1 కన్వీనర్ షేక్ జంషీర్ చేతుల మీదుగా సచివాలయ సిబ్బంది బుధవారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు త్వరలో అందజేస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

మర్రిపాడు: చిలకపాడు ఎస్సీ కాలనీలో రామాలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరు చేసిన రూ.10 లక్షలతో పాటు గ్రామ పెద్దల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్ రమాదేవి, నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం



పార్టీ పతాకావిష్కరణలో నేతలు



మూడో డివిజన్లో..

నెల్లూరు(బారకాసు): అన్ని వర్గాల సంక్షేమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. నగరంలోని 21 / 2 సచివాలయ పరిధిలో గల రవీంద్రనగర్‌లో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం కల్పించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. పాతపాటి పుల్లారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, వెంకటరత్నం, శేఖర్, కృష్ణమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, రవి, కృష్ణ, సాయి, బుజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని నాలుగు డివిజన్లలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడో డివిజన్లోని జాకీర్‌హుస్సేన్‌నగర్ సచివాలయ పరిధిలో పార్టీ పతాకాన్ని కార్పొరేటర్ సంక్రాంతి అశ్విని ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

- పదో డివిజన్లోని రామ్‌నగర్ సచివాలయ పరిధిలో కార్పొరేటర్ కిన్నెర ప్రేమ్‌కుమార్.. 39వ డివిజన్లోని అరిగెలవారివీధిలో జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న.. 49వ డివిజన్ దోర్నవీధి సచివాలయ పరిధిలో డివిజన్ ఇన్‌చార్జి వందవాశి రంగ నేతృత్వంలో కార్యక్రమాలను జరిపారు.

సంక్షేమ పాలనను ఆదరించండి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు సంక్షేమ పాలన సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గొల్లకందుకూరులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూరల్ మండలంలో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించి.. వారికి చేకూరిన లబ్ధిని వివరించాలని కోరారు. సచివాలయ ఎదుట పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గొల్లకందుకూరులో జరిగిన అభివృద్ధి, సంక్షేమ వివరాలను తెలిపే బోర్డును ఆవిష్కరించారు. రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల కన్వీనర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ధర్నా



నెల్లూరు(సెంట్రల్): విశ్రాంత గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు కంప్యూటర్ ఇంక్రిమెంట్‌ను అమలు చేయాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రిటైర్డ్ వెల్ఫేర్ సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి కోరారు. నగరంలోని ఏపీజీబీ రీజినల్ కార్యాలయం ఎదుట బుధవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కడపలోని ప్రధాన కార్యాలయం ఎదుట మహా ధర్నాను డిసెంబర్ నాలుగున చేపట్టనున్నామని పేర్కొన్నారు. చంద్రశేఖర్, రామ్, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రాఫ్ట్స్ షాపింగ్ ఎక్స్‌పో ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో న్యూ ఇండియన్ క్రాఫ్ట్స్ షాపింగ్ ఎక్స్‌పోను ప్రారంభించామని మేనేజర్ అమితేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో పది వేలకుపైగా ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచామని వివరించారు. లఖ్‌నవూ, చికాన్‌వర్క్ సూట్స్, డ్రస్ మెటీరియల్స్, టాప్స్, బదోహీ కార్పెట్స్, డోర్ మ్యాట్స్, సహారన్‌పూర్ ఉడెన్ ఫర్నిచర్ తదితరాలను అందుబాటులో ఉంచామని వివరించారు. రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 వరకు ఎక్స్‌పో ఉంటుందన్నారు. కొనుగోలుదారులకు ఉచిత ప్రవేశంతో పాటు పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించామని, ఎక్స్‌పోను ఆదరించాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నెల్లూరు (దర్గామిట్ట): తెలుగుగంగలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరమణ మృతి చెందడంతో అంత్యక్రియలకు రూ.పది వేల ఆర్థిక సాయాన్ని జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘ నేతలు బుధవారం అందజేశారు. ఈ మేరకు వారి నివాసానికి వెళ్లి ఈ మొత్తాన్ని కుటుంబసభ్యులకు సంఘ అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య, జాయింట్ సెక్రటరీ కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు అంకయ్య, పెంచలకృష్ణయ్య ఇచ్చారు.

కృష్ణా జలాలను అందించాలని వినతి

నెల్లూరు (దర్గామిట్ట): కృష్ణా జలాల ట్రిబ్యునల్ తీర్పు మేరకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కృష్ణా జలాలను కండలేరుకు అందించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు తెలుగుగంగ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఎస్సెస్సార్ నాయుడు, నాగేంద్రసింగ్, పైడిమాని ఆదినారాయణ, కంచర్ల నారాయణయాదవ్, ఉడతా ప్రభాకర్, ఆడిటర్ లక్ష్మణరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో జాగ్రత్తలు పాటించాలి

నెల్లూరు(సెంట్రల్): వరిసాగులో రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తే ఖర్చు గణనీయంగా తగ్గుతుందని ఏడీఏ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిలకపెట్టే సమయం.. మందుల పిచికారీ క్రమంలో నీరు ఎంత మేర ఉండాలో తెలుసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించాలని కోరారు.

కేజీబీవీల్లో వేతన పెంపుపై హర్షం

నెల్లూరు (టౌన్): కేజీబీవీల్లో పార్ట్ టైమ్ ఉద్యోగుల వేతనాన్ని రూ.12 వేల నుంచి రూ.26,759కు పెంచుతూ జీఓ జారీ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(బారకాసు): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మేయర్ స్రవంతి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడారు. రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.

డివిజన్ల వారీగా లోతట్టు ప్రాంతాలను గుర్తించి అప్రమత్తం చేయాలని.. వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

సంగం: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి సూచించారు. మండలంలోని పడమటిపాళెం ఆర్‌బీకేలో బుధవారం రబీ సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా సేంద్రియ, రసాయన ఎరువులను వాడుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆత్మ పీడీ దొరసానమ్మ నానో యూరియా, నానో డీఏపీ అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌కుమార్ వరిలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులను వివరించారు.

ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ

చేజర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభను బుధవారం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలపై ఏపీడీ సుజాత విచారణ చేపట్టారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,29,81,436 విలువైన పనులు చేపట్టగా, రూ.56,875 మేర అవకతవకలను గుర్తించి రికవరీకి ఆదేశించినట్లు ఆమె తెలిపారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నారాయణ, క్వాలిటీ కంట్రోలర్ వేణుగోపాల్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎస్సార్పీ వెంకయ్య, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, ఎంపీడీఓ ఎస్‌కే కరీముల్లా పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో ఎరువుల పంపిణీ



యూరియాను నిల్వ చేయిస్తున్న ఏఓ హరికరుణాకర్‌రెడ్డి

వెంకటాచలం : మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి హరికరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నిడిగుంటపాళెనికి వచ్చిన యూరియాను ఆయన బుధవారం గోదాములో నిల్వ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున కొన్ని గ్రామాల్లో రైతులు వరినాట్లు వేయడం పూర్తి చేశారని, సర్వేపల్లి రిజర్వాయర్ ఆయకట్టు కింద నారుమళ్లు పోసి వరినాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా కొరత లేకుండా నిల్వ ఉంచామన్నారు. డీఏపీ, ఇతర ఎరువుల నిల్వ చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎన్‌జీఓ నిర్వాహకులు

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం) : ప్రజలు హెచ్‌ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని సార్ద్స్ ఎన్‌జీఓ నిర్వాహకులు కోరారు. ప్రపంచ ఎయిడ్స్ వారోత్సవాల సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం కమ్యూనిటీ హాల్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ నిర్వాహకులు కవితా ప్రియ, సునంద, అనూష, నూర్జహాన్, మొబీనా, కౌన్సిలర్ జయంతి తదితరులు ఉన్నారు.

వేమూరు శ్రీరామశాస్త్రి విగ్రహావిష్కరణ



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామాలయ ప్రాంగణంలో వేమూరు శ్రీరామశాస్త్రి విగ్రహాన్ని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోదండరామస్వామి దేవస్థానానికి దాదాపు వందేళ్ల క్రితం తన యావదాస్తిని సమర్పించిన పుణ్యమూర్తి శ్రీరామశాస్త్రి అని కొనియాడారు. పవిత్ర పుణ్యక్షేత్రం కాశీ నుంచి శివలింగాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించిన శ్రీరామశాస్త్రి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలను తెలియజేశారు.

ఓటీపీలు అడిగితే కేసులు పెడతాం

సంబంధంలేని వ్యక్తులు ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో ఓటీపీలను సేకరించడం తగదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంతో సంబంధంలేని వ్యక్తులు వచ్చి ఓటీపీలు అడిగితే వారిని కచ్చితంగా పోలీసులకు అప్పజెప్పి కేసులు పెడతామని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా బీఎల్వోలతో వెరిఫికేషన్ చేయించుకోవాలే తప్ప, సంబంధం లేని వ్యక్తులు వస్తే సహించేదిలేదన్నారు. కార్పొరేటర్లు కిన్నెర ప్రేమ్‌కుమార్, మొగళ్లపల్లి కామాక్షిదేవి, కర్తం ప్రతాప్‌రెడ్డి, మద్దినేని మస్తానమ్మ, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గణేశం వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో మండల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శీవేలి ఉత్సవం తదితరాలను వేడుకగా బుధవారం జరిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా బట్టేపాటి విజయమ్మ, బట్టేపాటి నరేంద్రరెడ్డి, గాయత్రిరెడ్డి, సునీల్‌రెడ్డి, కలికి భక్తవత్సలరెడ్డి, లత, చెన్నారెడ్డి రమేష్‌రెడ్డి, జ్యోతిర్మయి దంపతులు వ్యవహరించారు.

‘మెడికవర్’లో శస్త్రచికిత్స విజయవంతం



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు సిటీ: నగరంలోని మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని వైద్యులు రమేష్, అవినాష్ పేర్కొన్నారు. నగరంలోని మెడికవర్ హాస్పిటల్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగరానికి చెందిన శారద శ్వాస సంబంధిత సమస్యతో ఇబ్బంది పడ్డారని, ఈ క్రమంలో తమ ఆస్పత్రికి రాగా వైద్య పరీక్షలు చేశామన్నారు. ఛాతి లోపల 10 సెంటీమీటర్ల వ్యాసార్థంతో గడ్డను గుర్తించామని, తమ వైద్య బృంద సహకారంతో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకొని డిశ్చార్జయ్యారన్నారు. వైద్యుడు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో అంధకారం

- ఇష్టానుసారంగా విద్యుత్ సరఫరా నిలిపివేత
- ప్రజల అవస్థ

నెల్లూరు రూరల్: నగర శివారు కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం సాయంత్రం నుంచి నిలిపోయింది. వర్షానికితోడు విద్యుత్ అంతరాయంతో ప్రజల పాట్లు వర్ణనాతీతమయ్యాయి. సమస్యను అధికారులకు తెలియజేయాలనే ఉద్దేశంతో స్థానికులు ఫోన్ చేసినా ప్రయోజనం లభించలేదు. ఈ ప్రాంతంలో నిత్యం ఇదే సమస్య తలెత్తుతోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రహీమ్

కోవూరు : ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేలా దృష్టి సారించాలని ఎంఈఓ రహీమ్ అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం జరిగిన కాంప్లెక్స్ స్థాయి శిక్షణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనలో నూతన మెళకువలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరసింహమూర్తి, రాధారాణి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న కోవూరు ఐసీడీఎస్ పీడీ జ్యోతి

కోవూరు : అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి అన్నారు. కోవూరులోని ప్రాజెక్టు కార్యాలయంలో కోవూరు, పడుగుపాడు సెక్టార్‌కు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తల అవగాహన సదస్సులో ఆమె బుధవారం పాల్గొని, మాట్లాడారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువులను నమోదు చేయాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారి పరిధిలో గృహ సందర్శన చేపట్టి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా రక్తహీనతతో బాధపడుతుంటే వారి వివరాలను తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, ప్రసన్నలక్ష్మి తదితరులు ఉన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

కోవూరు : గ్రామీణ ప్రాంతాల యువత ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. కోవూరులోని జెడ్పీ పాఠశాల సమావేశ మందిరంలో క్రీడా పోటీల నిర్వహణపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలు డిసెంబర్‌లో ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీలకు సంబంధించి ఫిజికల్ డైరెక్టర్ల పర్యవేక్షణలో రిఫరీలుగా వలంటీర్లు ఉండేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.